క్లుప్తంగా

గ్యాస్‌లీక్.. తప్పిన ప్రమాదం

తొగుట(దుబ్బాక): వంట చేస్తుండగా గ్యాస్‌లీకై ఇంట్లో ఫర్నీచర్ కాలి బూడిదైంది. ఈ ఘటన మండలంలోని చందాపూర్‌లో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, బాధితుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన బెజుగామ నర్సయ్య ఇంట్లో వంట చేస్తుండగా గ్యాస్ లీకైంది. దీంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఇంట్లో వారు భయంతో బయటకు పరుగులు తీశారు. వెంటనే గ్రామస్తులు సమాచారం అందించడంతో అగ్నిమాపక అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. ఫ్రిడ్జ్, ఫర్నీచర్, బియ్యం, వంటసామగ్రి, దుస్తులు కాలిపోయాయి. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని మాజీ సర్పంచ్ బొడ్డు నర్సింహులు కోరారు.

ఎమ్మెల్యే, ఎస్సీ, ఎస్టీ చైర్మన్‌ల పరామర్శ



నివాళులర్పిస్తున్న ప్రభాకర్‌రెడ్డి, వెంకటయ్య

దుబ్బాక:/దుబ్బాకరూరల్:/మిరుదొడ్డి(దుబ్బాక): దుబ్బాక మున్సిపల్ మాజీ చైరపర్సన్ గన్నె వనిత భూంరెడ్డి కుటుంబాన్ని శుక్రవారం ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పరామర్శించారు. ఐదు రోజుల క్రితం మాజీ చైర్మన్ వనిత మాతృమూర్తి కిష్టమ్మ మరణించారు. వారి వెంట బీఆర్‌ఎస్ నాయకులు గుండెల్లి ఎల్లారెడ్డి, ఆస స్వామి, కిషన్‌రెడ్డి, రేపాక శ్రీనివాస్‌రెడ్డి, రేపాక రాంరెడ్డి ఉన్నారు. ఇటీవల మాతృ వియోగం పొందిన 13వ వార్డుకు చెందిన ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఇస్తారి గల్ల ఎల్లం కుటుంబ సభ్యులను వారు పరామర్శించారు. అదే విధంగా అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో మాజీ ఎంపీటీసీ బోయ శ్రీనివాస్ తండ్రి నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వారు శ్రీనివాస్‌ను కలిసి పరామర్శించి ఓదార్చారు.

ఇంటింటికీ జమ్మి పంపిణీ



జమ్మి పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ దీప్తి, నాగరాజు

సిద్దిపేటకమాన్: విజయదశమి పర్వదినాన తలపెట్టిన అన్ని పనుల్లో విజయం తథ్యమని కౌన్సిలర్ దీప్తి అన్నారు. దసరా పండుగను పురస్కరించుకుని 39వ వార్డులో బీఆర్‌ఎస్ నాయకుడు నాగరాజుతో కలిసి ఆమె ఇంటింటికీ జమ్మి ఆకులు, విజయానికి చిహ్నమైన జెండాను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ఆలయాలలో జమ్మి మొక్కలు నాటాలన్నారు. జమ్మిచెట్టుకు పూజ చేయడం వల్ల శుభం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో నాగరాజు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుల సాయం



ఫిక్స్‌డ్ డిపాజిట్ పేపర్లు అందిస్తున్న మిత్రులు

చేర్యాల(సిద్దిపేట): చిన్ననాటి మిత్రుడు అనారోగ్యంతో మృతి చెందగా ఆ కుటుంబానికి అతడి బాల్యమిత్రులు అండగా నిలిచారు. మండలంలోని ఆకునూరుకు చెందిన స్వర్గం సత్యం ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందాడు. దీంతో పెద్దదిక్కు కోల్పోయి ఆర్థిక సమస్యలతో బాధపడుతున్న ఆ కుటుంబానికి సత్యంతో కలిసి చదువుకున్న 1996–97 బ్యాచ్ పదో తరగతి మిత్రులు అండగా నిలిచారు. తలా కొంత మొత్తాన్ని జమచేసి రూ.లక్ష మృతుడి కుమార్తెల పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్ పేపర్లను శుక్రవారం అందజేశారు.

ముగిసిన త్రి రాత్రోత్సవాలు



అమ్మవారికి త్రిశూల స్నానం చేయిస్తున్న పూజారులు

కొమురవెల్లి (సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో నిర్వహించిన దేవీ త్రి రాత్రోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారిని శోభాయాత్రగా తీసుకువెళ్లి స్వామి పుష్కరిణి(ధర్మగుండం) లో త్రిశూల స్నానం చేయించి పరిసమాప్తి గావించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, స్థానాచారి మల్లయ్య, భాస్కర్, మనోహర్‌పాల్గొన్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం

13వ వార్డుపై నిర్లక్ష్యం ఎందుకు సారూ..!

- చెత్తాచెదారంతో నిండిపోయిన డ్రైనేజీలు
- రోడ్ల పక్క పెరిగిపోయిన పిచ్చిమొక్కలు



రేపల్లెవాడలో రోడ్ల పక్కన పెరిగిన పిచ్చిమొక్కలు, పొదలు

దుబ్బాక: డ్రైనేజీలలో చెత్తాచెదారం పెరిగిపోయింది. దీంతో మురుగునీరు నిలిచిపోయి దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయి. దుర్వాసనతో బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. అలాగే రోడ్ల పక్కన, ఖాళీస్థలాల్లోను పిచ్చిమొక్కలు, పొదలు ఏపుగా పెరిగిపోయి ఇబ్బందులు పడుతున్నారు దుబ్బాక 13వ వార్డు ప్రజలు.

ముక్కు మూసుకుంటున్నాం..

వార్డులోని చాలా గల్లీలలో డ్రైనేజీలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. దీంతో మురుగునీరు నిలిచిపోయి భరించలేని కంపు కొడుతుండడంతో ఇళ్లలో ఉండలేని పరిస్థితి దాపురించిందంటూ స్థానికులు వాపోతున్నారు. వానలు పడితే డ్రైనేజీల్లో నీరు సక్రమంగా ప్రవహించక పోవడంతో రోడ్లపైనే నిలిచిపోతున్నాయి. డ్రైనేజీలు, రోడ్లు సక్రమంగా లేక పోవడంతో ప్రజలు చాలా అవస్థలు పడుతున్నారు. మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వార్డును పట్టించుకొని సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.



గడ్డి, చెత్తాచెదారంతో నిండిపోయిన డ్రైనేజీ

కాంగ్రెస్ పాలనలో వెనుకబడిన రాష్ట్రం

వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: కాంగ్రెస్ ప్రభుత్వం 22 నెలల పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో 22 యేళ్లు వెనక్కి పోయిందని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం గజ్వేల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ తుంగలో తొక్కిందన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్‌లకు బీఆర్‌ఎస్ మద్దతు ప్రకటించిందని చెప్పారు. ఈ బిల్లును ప్రధాని, రాష్ట్రపతి వద్దకు తీసుకెళ్లి గెజిట్ వచ్చేలా చూడాల్సిన ప్రభుత్వం సరైన విధంగా ముందుకెళ్లడంలేదని ఆరోపించారు. దీని వల్ల ప్రజల్లో ఎన్నోరకాల అనుమానాలు, అపోహలు నెలకొన్నాయని, ఈ పరిస్థితికి అడ్డుకట్ట వేసి స్థానిక ఎన్నికలను సజావుగా నిర్వహించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. సమావేశంలో నాయకులు ఎన్‌సీ రాజమౌళి, నవాజ్‌మీరా, కృష్ణారెడ్డి, శ్రీనివాస్, దుర్గాప్రసాద్, నర్సింగరావు, కనకయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం తూప్రాన్‌కు చెందిన కాంగ్రెస్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ రఘుపతి వంటేరు సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేశారు.



మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

గాంధీజీ జీవితం అందరికీ ఆదర్శం

వివిధ యువజన సంఘాలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంస్థల ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. గ్రామాలు, పట్టణాల కూడళ్లలోని గాంధీజీ విగ్రహాలు, చిత్రపటాలకు కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ గాంధీజీ జీవితం దేశ ప్రజలందరికీ ఎంతో ఆదర్శవంతమైనదన్నారు. స్వాతంత్య్ర సమరంలో ఆయన చేసిన శాంతియుత పోరాటం మరువలేనిదని కొనియాడారు.



మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేటలో గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



తొగుటలో నివాళులర్పిస్తున్న ఎస్‌వి రవికాంత్‌రావు



జగదేవ్‌పూర్‌లో గాంధీజీ విగ్రహం వద్ద..



గజ్వేల్‌రూరల్: పాత మున్సిపల్ కార్యాలయం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

నూతన కార్యవర్గం ఏకగ్రీవం

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని దుద్దెడలో చైతన్య యూత్ అసోసియేషన్ నూతన కార్యక్రవర్గ ఎన్నికలు శుక్రవారం ఏకగ్రీవమయ్యాయి. అధ్యక్షుడిగా గున్నాల వెంకటేశ్, ఉపాధ్యక్షుడిగా తాళ్ల రవీందర్, ప్రధాన కార్యదర్శిగా బింగి భాస్కర్, సహాయ కార్యదర్శిగా లింగమూర్తి, సలహాదారులు గోనె శ్రీనివాస్, రాధాకృష్ణ, బొజ్జ రాజు, బొజ్జ జగదీశ్ ఎన్నికయ్యారు.



చైతన్య యూత్ అసోసియేషన్ నూతన కమిటీ

కనులపండువగా శోభాయాత్ర

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. అందులో భాగంగా మండపాలు వద్ద, ఆలయాల్లోను అమ్మవార్లకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి అమ్మవారి శోభాయాత్రలో భాగంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కోలాటాలు, భజన కీర్తనలతో యువకులు, చిన్నారులు కేరింతలు నడుమ ప్రధాన వీధుల గుండా అమ్మవార్ల విగ్రహాలను కనులపండువగా ఊరేగించి నిమజ్జనం చేశారు.



కొండపాక(గజ్వేల్): మర్పడ్గలో రాజరాజేశ్వరీ దేవిగా దుర్గామాత



జగదేవ్‌పూర్(గజ్వేల్): కొండపోచమ్మ ఆలయంలో భక్తుల పూజలు



మిరుదొడ్డిలో అమ్మవారి ఊరేగింపు



నంగునూరులో నిమజ్జనానికి బయలుదేరుతున్న అమ్మవారు



కొండపాక(గజ్వేల్): పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



మర్కూక్ (గజ్వేల్): గంగాపూర్‌లో అమ్మవారి ఊరేగింపు

వైభవంగా విజయదశమి

విజయదశమి, దసరా వేడుకలను జిల్లా వ్యాప్తంగా గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రజలు ఉదయాన్నే కొత్త బట్టలు ధరించి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి పాలపిట్టను చూసేందుకు తరలి వెళ్లారు. దసరా పర్వదినం సందర్భంగా పలు గ్రామాల్లో జాతీయపతాకాల ఆవిష్కరణ, జమ్మిచెట్టుకు పూజలు నిర్వహించారు. సిద్దిపేటలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు జమ్మిచెట్టుకు పూజలు చేశారు. అలాగే దుబ్బాకలో ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, మండలంలోని బొప్పాపూర్‌లో ఎంపీ రఘునందన్‌రావు పూజల్లో పాల్గొన్నారు. గజ్వేల్ మహంకాళీ ఆలయం వద్ద రావణదహన కార్యక్రమం ఘనంగా జరిపించారు. ప్రజలంతా వేడుకల్లో పాల్గొని జమ్మి పంచుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



సిద్దిపేటలో జమ్మిచెట్టుకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు



దుబ్బాకరూరల్: జమ్మిచెట్టుకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి



బొప్పాపూర్‌లో వేడుకల్లో పాల్గొన్న ఎంపీ రఘునందన్‌రావు



కొమురవెల్లి(సిద్దిపేట): మల్లన్న ఆలయంలో జమ్మిచెట్టుకు పూజలు చేస్తున్న అర్చకులు



మిరుదొడ్డి(దుబ్బాక): మిరుదొడ్డిలో రాములవారి ఊరేగింపు



గజ్వేల్‌లోని లక్ష్మీప్రసన్నకాలనీలో..



చిన్నకోడూరు(సిద్దిపేట): చంద్లాపూర్‌లో..



బెజ్జంకిలో లక్ష్మీనరసింహస్వామి ఊరేగింపు



మద్దూరు(హుస్నాబాద్): లద్నూరులో దసరా ఉత్సవాల్లో పాల్గొన్న గ్రామస్తులు

ఊరికి సేవ చేయడంలోనే సంతృప్తి



గ్రామస్తులతో కలిసి కమాన్‌ను ప్రారంభిస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

- అయిలేని వెంకటేశ్వర్‌రెడ్డి
- రూ.15 లక్షలతో కమాన్ నిర్మాణం

సిద్దిపేటఅర్బన్: పుట్టి పెరిగిన ఊరికి సేవ చేయడంలోనే ఎంతో సంతృప్తి ఉంటుందని, గ్రామానికి సేవ చేసేందుకు తాను ఎప్పుడు ముందుంటానని వ్యాపారవేత్త అయిలేని వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. అర్బన్ మండలంలోని మందపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై సుమారు రూ.15 లక్షలతో నిర్మించిన స్వాగత తోరణాన్ని గ్రామస్తులతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్‌లో గ్రామంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానన్నారు. విద్యార్థులకు మరింత సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. గ్రామ పెద్దలు కూడా అండగా నిలబడి సహాయ సహకారాలు అందించడం సంతోషంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా అశోక విజయదశమి వేడుకలు

హుస్నాబాద్: మౌర్య చక్రవర్తి అశోక విజయదశమి వేడుకలను దళిత, బహుజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. అనంతరం రావణ శూర వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామాయణ కాలంలో రావణుడు అన్యాయం చేశాడని, రాక్షసుడని దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. రామ్‌లీలా పేరుతో రావణుడి దిష్టిబొమ్మను దహనం చేసే కార్యక్రమాలను కొందరు విపరీత చేష్టలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రావణ వధ పేరుతో బాంబులు కాల్చడం వల్ల పర్యావరణానికి ప్రమాదమన్నారు. హుస్నాబాద్‌లో రావణ వధ కార్యక్రమం నిర్వహించకూడదని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు మేకల వీరన్న యాదవ్, కొయ్యడ కొమురయ్య, సంపత్ కుమార్, మెతుకు కొమురయ్య, గంపల శ్రీనివాస్, లక్ష్మణ్ గౌడ్ తదితరులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు